నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జనవరి 22, 2025 | www.navatelangana.com

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్‌కేర్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో 62 మందికి పరీక్షలు నిర్వహించగా 44 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి విడతల వారీగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ శిబిరాన్ని కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



స్వాతంత్ర్య సమరయోధుడు మృతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు దండనాయకుల శ్రీనివాసరావు(97) మంగళవారం మృతి చెందాడు. జిల్లా కేంద్రంలో పుట్టి స్వతంత్ర సమయంలో హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న నిజాం పాలకులకు వ్యతిరేకంగా జిల్లాలో జరిగిన పోరాటంలో తన వంతు పాత్ర పోషించారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటంతో పాటు స్వాతంత్ర సమరయోధుడిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు. శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్ల సంతానం. ఇందులో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం వ్యవస్థాపకుడు నాగబాల సురేష్ ఉన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆయన అంత్యక్రియలకు జిల్లా కేంద్ర వాసులతో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఆయనతో ఉన్న ఆత్మీయతను గుర్తు చేసుకున్నారు.



ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-నార్నూర్

ఆలయాల అభివృద్ధికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి-హెచ్‌లోని బంజారాల దీక్ష భూమి వద్ద ప్రేమ్‌సింగ్ మహారాజ్ సమక్షంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.24లక్షలతో అభివృద్ధి పనులకు పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణతో కలిసి భూమి పూజ చేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, జేఏసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తం, నాయకులు రాథోడ్ శేసేరావ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారుతీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, రాథోడ్ దత్తరాం, దుర్గే కాంతారావు, మాజీ సర్పంచ్ దిగంబర్, జాకూరుల్లా ఖాన్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నసీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముబషీర్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-సిరికొండ

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ ఫణిందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయ ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. రైతు భరోసా, ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక జాబితాను చదివి వినిపించారు. కొందరు తమ పేర్లు రాకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. అన్ని అర్హతలున్నా తమ పేర్లు అందులో లేవని అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు వారిని సముదాయించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు విడతల వారీగా నమోదు చేస్తామని అన్నారు. టెక్నికల్‌గా కొన్ని ఇబ్బందులు కలిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అభిగ్న మాలవీయ, ఎంపిడిఓ రవీందర్, తహసీల్దార్ తుకారాం, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థికి అభినందనలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆసిఫాబాద్ మోడల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సూరజ్ సోలంకి ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ పోటీలలో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరజ్ మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీ గమినియల్, డీఎస్ఓ కటుకం మధుకర్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో బడి బయట పిల్లల సర్వేలో భాగంగా 6 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 19 సంవత్సరాల మధ్యలో ఉన్న విద్యార్థులను గుర్తించినట్లు దేవాపూర్ సీఆర్పీ మంతెన రమేశ్ తెలిపారు. చింతగూడెంలో ముగ్గురు, మద్దిమాడలో ఇద్దరు, దేవాపూర్‌లో ఆరుగురు, పెద్దాపూర్‌లో ఇద్దరు విద్యార్థులను గుర్తించామని తెలిపారు. విద్యార్థులను దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించడం జరుగుతుందని, సర్వేలో గుర్తించిన విద్యార్థుల వివరాలను ప్రబంధ పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు వివరాలను మండల విద్యాధికారి, జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

స్థిర వేతనం అమలు చేసే వరకూ పోరాటం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్
- కలెక్టరేట్ వరకు 10 కి.మీటర్ల పాదయాత్ర



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు స్థిర వేతనాన్ని అమలు చేసే వరకు పోరాటం ఆపేది లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని బూరుగుడ నుండి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు నిర్వహించిన పది కిలోమీటర్ల పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్ర కలెక్టరేట్‌కు చేరుకోగా ఆశాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేస్తూ నిర్ణయం తీసుకునే వరకు వివిధ దశల్లో పోరాటం చేస్తామన్నారు. గతంలో సమ్మె చేసిన ప్రతిసారి ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరం పద్మ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు 19 సంవత్సరాల నుండి అనేక అవస్థలు ఎదుర్కొంటూ ప్రభుత్వాలతో పోరాటాలు చేస్తున్నామన్నారు. పోరాటాలకు స్పందించని ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పిన చరిత్ర ఆశా కార్యకర్తలకు ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టో పెట్టిన హామీని నెరవేర్చాలని కోరారు. అప్పటి వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాలలో తమ సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమాచారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు స్వరూప, వనిత, మొగురా, నవీన, భారతి, లక్ష్మి, సరోజ, దేవి, పంచశీల, భీంబాయి, శ్రీలత పాల్గొన్నారు.

నాలుగు పథకాల అమలుపై గ్రామ సభలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ ఇల్లు, రైతు ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డు పథకాల అమలుపై మంగళవారం కాగజ్‌నగర్ మండలం ఎస్జీటస్ కాలనీ పంచాయతీ పరిధిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ ఈ నాలుగు ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తుదారులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ సోయం, పంచాయతీ కార్యదర్శి సునీల్, ఫీల్డ్ అసిస్టెంట్ పోశెట్టి, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

అదేవిధంగా కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నెం. 11లో నిర్వహించిన వార్డు సభకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్‌తో పాటు సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) సమరశీల పోరాటాలు



నవతెలంగాణ-వాంకిడి

ప్రజా సమస్యలపై పార్టీ సమరశీల పోరాటలు చేస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే పార్టీ రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్రంలో పేద ప్రజల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. సమస్యల పరిష్కారమయ్యేంత వరకూ ప్రభుత్వంతో పోరాడుతున్నామన్నారు. జిల్లాలో పోడు రైతుల పక్షాన పార్టీ పోరాడి భూములకు పట్టాలు ఇప్పించిందని, తునికాకు సేకరణలో భాగంగా పులి పేరుతో తునికాకు సేకరించకూడదని అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారని, సేకరణ సాగేల కలెక్టర్ ద్వారా రాష్ట్ర అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. దీంతో జిల్లాలో తునికాకు సేకరణ ప్రారంభమైందన్నారు. కుమురం భీం ప్రాజెక్టు కాలువలు పూర్తిచేసి రైతులకు నీరు అందించాలని, జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించాలని, దానికి అనుబంధంగా ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యులు, సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ గురించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి బోనస్ ఇప్పించాలని, కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుండి పెద్దవాగు వంతెన వరకు అస్తవ్యస్తంగా మారిన రోడ్డుకు మరమ్మత్తు చేయించాలని కోరారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని తెలిపారు. రాష్ట్ర మహాసభలకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారన్నారు. రాబోయే కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలు రూపొందిస్తారని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే మహాసభలకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, మండల నాయకులు దుర్గం నిఖిల్, జాడి తిరుపతి, వడ్లూరి శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పిఆర్‌టియుటిఎస్ భవన్‌లో కరీంనగర్ ఆదిలాబాద్ నిజామబాద్ మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సంఘం బలపరచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డితో కలిసి ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్సిని సాధిస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల మెడికల్ జిపిఎఫ్ టిఎస్ జిఎల్ఐ ఫైనల్ పేమెంట్ పదవి విరమణతో పాటు ఉపాధ్యాయుల అన్ని రకాల ఆర్థిక బిల్లులు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి జూనియర్ లెక్చరర్, మండల విద్యాధికారి, డైట్ లెక్చరర్, డిప్యూటీ డీఈవో పదోన్నతులు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాక్టీవ్ టీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట నరేంద్రబాబు, బివి రమణారావు, రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఏనుగు అశోక్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-మంచిర్యాల

36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణాశాఖ, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రత నియమాలపై శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ హైదరాబాద్ కో ఆర్డినేటర్ డాక్టర్ నీలం సంపత్, డీటీఓ సంతోష్ కుమార్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా లక్షాఎనభైవేల పైచిలుకు మరణాలు జరుగుతున్నాయన్నారు. దీనికి 80 శాతం పైగా మానవ తప్పిదాలే కారణమవుతున్నాయని తెలిపారు. వివిధ రకాల వాహన డ్రైవర్లతో పాటు రోడ్డు యూజర్లంతా ట్రాఫిక్ నియమాలను తూచ తప్పకుండా పాటిస్తూ రహదారులపై భద్రతతో కూడిన ప్రయాణాలు కొనసాగించాలని తెలిపారు. హెల్మెట్ లేకుండా, సీటు బెల్ట్ ధరించకుండా వాహనాలను నడపరాదని, అదే విధంగా మద్యం మత్తులో, నిద్ర మత్తులో, మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ పరధ్యానంగా వాహనాలను నడపరాదని తెలిపారు. 12 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విద్యా సంస్థలు, పారిశ్రామిక సంస్థలలో వేలాది మంది విద్యార్థులను, కార్మికులను, ఉద్యోగులను రహదారి భద్రత పట్ల అవగాహన కలిగిస్తూ ముందుకు సాగుతున్న రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్, హైదరాబాద్ సేవలను డీటీఓ, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ అండ్ స్టాఫ్, మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, స్టాఫ్ అభినందించారు.

ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విద్యార్థులు ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించుకున్నట్లయితే భవిష్యత్తులో ఉన్నతస్థితికి ఎదగడానికి అవకాశం ఉంటుందని డీఈవో రామారావు అన్నారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) జిల్లా అధ్యక్షులు కడార్ల రవీంద్ర అధ్యక్షతన ఇంగ్లీష్ ఒలింపియాడ్ రాత పరీక్ష, ఉపన్యాస పోటీలను మంగళవారం అనుశ్రుత రిసోనెన్స్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్టా జిల్లా శాఖ ఎంతో ఉత్సాహంగా ఆంగ్ల భాష అభివృద్ధికి కృషి చేస్తుందని, విద్యార్థులకు కావలసిన స్టడీ మెటీరియల్ అందజేయడంలో అలాగే ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వడంలో ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఈ రోజుల్లో ఆంగ్ల భాష ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.భూమన్న యాదవ్, ఆర్థిక కార్యదర్శి రతన్‌కుమార్, వేణుగోపాల్, రాంమోహన్, లక్ష్మీపతి, సంధ్యారాణి పాల్గొన్నారు.

అర్హులైన లబ్దిదారులను గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యం

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి



నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గ్రామ సభల్లో పథకాలకు అర్హులైన వారిని గుర్తిస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం భీంపూర్ మండలం అందర్‌బంద్, అంతర్గాం, ధనోర, గుబిడి, పిప్పల్‌కోటి, తాంసి మండలం అంబుగామ, పాలోది, బండల్‌నాగపూర్, హస్నాపూర్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. డీసీసీబీ చైర్మెన్ హస్నాపూర్ గ్రామ సభలో పాల్గొన్నారు. తహసీల్దార్ లక్ష్మి రైతు కూలీలు, రైతు భరోసా, ఇందిరమ్మ పథకం, రేషన్‌కార్డుల లబ్ధిదారుల పేర్లను గ్రామస్తుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు పథకాలను అమలు చేస్తున్నారని, మరో మూడు పథకాల అమలు ఈ నెల 26 నుండి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ పథకాలు అమలు చేయడానికి లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ప్రతి గ్రామంలో ప్రజల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి అర్హులను గుర్తించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ పథకాల అమలు నిరంతరమైన ప్రక్రియ అని, ఎవరూ కూడా ఆందోళన చెందకుండా అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ తహసీల్దార్ నలందప్రియ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తాంసి ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీఓ లింగయ్య, ఆయా మండలాలక ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సూర్యనగర్‌ను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాకేర గ్రామపంచాయతీ పరిధిలో గల సూర్యనగర్ గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ సుభాష్‌చందర్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ దుర్గం రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో 160 కుటుంబాలున్నాయని, గ్రామ జనాభా 818 వరకు, ఓటర్ల సంఖ్య 520 ఉందని తెలిపారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ఎస్సీ ఎస్టీ కమ్యూనిటీ భవనం, స్వయం సహాయక మహిళా సంఘాలు 16 ఉన్నాయని తెలిపారు. గ్రామపంచాయతీ నిర్మాణానికి ఐదు గుంటల స్థలం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దరావత్ గుండేరావ్, జాదవ్ గోపాల్, దరావత్ రమేష్ జాదవ్ గోపిచంద్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పోలీస్ భరోసా సిబ్బంది

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ బస్టాండ్‌లో గుర్తుతెలియని మతిస్థిమితం లేని మహిళ ఒంటిపై దుస్తులు లేకుండా తిరుగుతుండగా, సమాచారం తెలిసి అదే పరిసర ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా భరోసా ఇన్‌చార్జి మహిళా ఎస్సై సుమాంజలికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన భరోసా, షీటీం సిబ్బంది ఆ మహిళని బస్టాండు వద్ద వెతకగా కనిపించలేదు. దీంతో ఆరా తీయగా చైన్‌గేట్ వద్ద కలిసి ఆమెకి బట్టలు కొనిచ్చి మానవత్వం చాటుకున్నారు. తరువాత సఖి సెంటర్ వారికి అప్పగించారు. కాగా జిల్లా ఎస్పీ డా జి.జానకి షర్మిల భరోసా టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ సుమాంజలి, షీటీం రాధిక, రజిత, భరోసా ఏఎస్ఎం స్వప్న, కౌన్సిలర్ జ్యోతిలను అభినందించారు.



రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సంఘం తరపున జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో, విలాస్‌రావు, గుజ్జ జనార్ధన్, పూదరి జనార్ధన్, లోలం గంగన్న, రాఘవులు పాల్గొన్నారు.



ఆశాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

- డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు పాదయాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫిబ్రవరి నెలలో జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆశా కార్యకర్తలు కిలోమీటర్ల పాదయాత్రతో పాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర కలెక్టరేట్‌కు చేరుకుంది. ధర్నా నిర్వహించి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ ఎన్నికలకంటే ముందు ఇన్‌చార్జి మంత్రి సీతక్క అనేక హామీలు ఇచ్చి మంత్రి అయిన తరువాత విస్మరించారని ఆరోపించారు. కేరళ రాష్ట్ర తరహాలో ఆశాలకు రూ.18వేల నిర్ణీత వేతనాలు చెల్లించాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ భద్రతతో పాటు రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పండుగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటిపై ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్ కుమార్, ఆశా కార్యకర్తలు నైతం శోభ, సుజాత, లక్ష్మీ, మాధవి, స్వప్న, సురేఖ, మమత, ఆశా పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్ : ఆశాలకు నిర్ణీత వేతనం అందజేయాలని, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత అన్నారు. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు అనేక పని ఒత్తిడి తట్టుకొని నిత్యం సేవలు అందిచటం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డ్స్, రివార్డ్ వచ్చాయన్నారు. కనీస వేతనం రూ.18వేలు వచ్చేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చిందని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయాలని అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి నేటి వరకు ఈ సంవత్సర కాలంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఉన్నతాధికారులకు అనేక విజ్ఞప్తులు చేశామన్నారు. నిరంతరం ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆశలు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఏఎస్ఎం ట్రెనింగ్ పూర్తి చేసిన ఆశాలకు, ఏఎస్ఎం పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించి వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలన్నారు. ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు, 6 నెలలు మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రకళ, సుగుణ, ఇంద్రమాల, రమాలక్ష్మి, కమల, కార్యదర్శులు శ్యామల, నాయకులు సులోచన, గంగా లక్ష్మి, మంగ, శారద పాల్గొన్నారు.


నిర్మల్‌టౌన్

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నార్నూర్ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరామర్శించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారి వివరాలతో పాటు హైదరాబాద్ రెఫర్ చేసిన వారి వివరాలను అడిగారు. మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జాతరకు వెళ్తున్న సమయంలో గుడిహత్నూర్ మండలం సూర్యగూడకు చెందిన వారు ప్రమాదంలో గాయపడ్డారన్నారు. కెరమెరి జంగుబాయి దేవస్థానానికి వెళ్తున్న క్రమంలో నార్నూర్ మండలంలో వాహనం బోల్తాపడటంతో 47 మందికి గాయలు కాగా, రిమ్స్ 35 చికిత్స కోసం తరలించారన్నారు. రక్త స్రావం అధికమవడంతో ఇద్దరు మరణించడం బాధకరమన్నారు. ప్రభుత్వం పరంగా సాయం అందేలా తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. దైవ దర్శనాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏజెన్సీ అదనపు డీఎంహెచ్‌ఓ కుడ్మెత మనోహర్, ఐటీడీఏ లైజన్ అధికారి సమీఉద్దీన్, వైద్యులున్నారు.

సీఎం కప్ విజేతలకు బహుమతులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుమారి గ్రామంలో జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ విజేతలకు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థులు, గ్రామస్తులు యువకులు అందరూ కలిసి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక ధృఢత్వం పెంపొందుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రానున్న ఒలంపిక్ పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించడం జరుగుతుందని, సీఎం కప్‌తో గ్రామీణస్థాయి క్రీడాకారులను వెలికితీసి వారికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం రవీంద్రనగర్‌లో నిర్వహించిన వార్డు సభకు అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅథితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు సభలో లబ్దిదారుల జాబితను అధికారులు చదివి వినిపించారు. అనంతరం పథకాలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజంలోని చివరి వరసలో ఉన్న పేదోడికి ప్రభుత్వ ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఎన్నికల వరకే పార్టీలని, గెలిచిన తరువాత ప్రజల సంక్షేమం కోసమే అందరూ పని చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వాలు ప్రజలవనీ, పార్టీలవి కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అదే విధంగా పథకాల లబ్ది కోసం నాయకులు, అధికారులను ప్రసన్నం చేసుకుంటే వస్తాయన్న ఆలోచనలను తీసేయాలన్నారు. లబ్దిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శంగా నిర్వహించాలన్నారు. స్థలం ఉన్న వారికే ఇండ్లు ఇస్తామంటే పేదలకు ఇండ్లు రావన్నారు. స్థలాలు లేని పేదలకు కూడా స్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు...

పథకాల కోసం మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని, పూర్తిగా పారదర్శంగా ఎంపిక ఉంటుందని అదనపు కలెక్టర్ శ్యామలదేవి తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమక్షంలోనే ఎంపిక చేస్తామన్నారు. మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు, వార్డు కౌన్సిలర్ గంద్రత్ లక్ష్మీ, బీజేపీ పట్టణ అధ్యక్షులు లాలామున్న, అధికారులు రుచిత, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండలంలో ప్రజాపాలనలో భాగంగా గ్రామాలలో గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల జాబితాలో తమ పేర్లు లేవని ఆశావాహులు అధికారులను నిలదీశారు. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలనీ తెలుపడంతో ప్రజాపాలనలో ముందుగానే దరఖాస్తులు ఇచ్చామని, మొత్తం డాటా అధికారుల వద్ద ఉన్నప్పటికీ మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేసుకోవడమేమని ప్రశ్నించారు. అంతేకాకుండా మండలంలోని దేగామ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో మాజీ వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పథకాల కోసం తీసుకున్న దరఖాస్తులను తప్పుగా నమోదు చేయడంతో ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు అందలేదని, ఇకనైనా తీసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మోహన్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభలు నిర్వహించే గ్రామాలు...

నేరడిగొండ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజ్‌వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బోరిగామ, బుద్ధికొండ, ఈస్పూర్, కుంటాల, లకంపూర్(జి), రాజుర, తర్నం(కె) గ్రామాలలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే ఈ నాలుగు గ్యారంటీలను అర్హులైన వారు వినియోగించుకోవాలని తెలిపారు. అంతేకాకుండా గ్రామసభలో వివరించే ప్రభుత్వ హామీలపై ఏమైనా సందేహాలు ఉన్న గ్రామసభలో ఉన్న అధికారులతో తెలుపాలని సూచించారు.

క్రీడలు ఉత్సాహంగా పనిచేసే శక్తినందిస్తాయి : ప్రభాకర్‌రావు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడిల నుంచి క్రీడలు ఉపశమనం కలిగిస్తాయని, మానసికోల్లాసాన్ని కలిగించి, మరింత ఉత్సాహంగా పనిచేసే శక్తిని అందిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం క్రీడపోటీలను ప్రారంభించారు. న్యాయమూర్తులు క్యారం ఆడి న్యాయవాదులను ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధఢత్వం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని క్రీడల కోసం కేటాయించడం వల్ల మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించే వీలు కలుగుతుందన్నారు. అలాగే ఇరువర్గాల నడుమ సహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని సూచించారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీల్లో న్యాయవాదులు పాల్గొనాలని, గెలుపొందిన వారికి 26న బహుమలును అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు హుస్సేన్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్నాల నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ బూత్‌లో రాజ్యాంగ గౌరవ దినోత్సవం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో రాజ్యాంగ గౌరవ దినోత్సవాన్ని నిర్వహించాలని బీజేపీ మండలాధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ని కాంగ్రెస్ ఎలా అవమానించిందో, బీజేపీ ఎలా ఆయనను, ఆయన ఆలోచన విధానాన్ని గౌరవించిందో ప్రతీ గ్రామాన 22, 23 తేదీలలో వెళ్లి వివరించాలని సాబ్లే సంతోష్ చెప్పారు. 24, 25 తేదీలలో ప్రభుత్వ పాఠశాలకు, ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు రాజ్యాంగం గురించి అవగాహన కల్పించే విధంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు. అలాగే 26న గణతంత్ర దినోత్సవాన్ని ప్రతీ పోలింగ్ బూత్‌లో ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దళిత మోర్చా మండలాధ్యక్షుడు లింగంపల్లి సురేష్, జిల్లా కార్యదర్శి పరశురాం, మండల నాయకుడు మెరుగు శ్రీధర్ రెడ్డి, పోలింగ్ బూత్ అధ్యక్షులు దూత్వాల రంజిత్, ఏలేటి మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.



నామ్‌కే వాస్తే నడుస్తున్న రెండు గ్యారంటీలు

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, నామ్‌కే వాస్తే రెండు పథకాలను అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోడ్డు సౌకర్యం ఉన్న బస్సులుండవని, ఫ్రీ బస్సు సౌకర్యాన్ని మహిళలు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోతున్నారని అన్నారు. రూ.5వందలకు గ్యాస్ అని చెప్పి కొందరికే ఇచ్చారని తెలిపారు. 200 యూనిట్ల కరెంట్ ప్రజలకు అందడం లేదన్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన సీఎం సంవత్సరాలు గడిచిన వాటి ఊసే లేదన్నారు. ఎన్నికల ముందు రైతు భరోసా, రుణమాఫీ, 24 గంటల కరెంట్, మూడు లక్షల వడ్డీ లేని రుణాలు, ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని చెప్పారన్నారు. దీంతో పాటు పింఛన్ పెంచుతామని, నిరుద్యోగ భృతి ఇస్తామని, ఇలా అనేక హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియల్లో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీలపై నిలదీయాలని సూచించారు. రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీలో సభ్యుడిగా జోగు రామన్నను నియమించడంతో పార్టీ నాయకులు ఆయనను సత్కరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, దేవన్న, సతీష్, గోవర్ధన్, రాజు, విఠల్, సంతోష్, దయాకర్ ఉన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. వారాహి హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅధితిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి తగ్గట్టుగా ప్రణాళిక బద్దంగా చదవాలని సూచించారు. ఎమ్మెల్యే తన బాల్య జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే డ్రగ్స్, సైబర్ క్రైమ్, సైకాలజీ ప్రాబ్లమ్స్, మానసిక ఒత్తిడి పైన వక్తలు విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో

సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, సీఐ శ్రీనివాస్, మోటివేషనల్ స్పీకర్ వేణు, రంగినేని పవన్, రిమ్స్ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఓంప్రకాష్, పోటీ పరీక్షల నిపుణులు పురుషోత్తంరెడ్డి, రమణగౌడ్, వారాహి హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సభ్యులు రామగిరి శిరీష్, బండి ప్రవీణ్, మహేష్, నిఖిల్, వంశీ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | జనవరి 22, 2025 | www.navatelangana.com

ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని ఈపీ ఆపరేటర్ల సమస్యలపై సింగరేణి కాలనీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీఎంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల సీ నుంచి బీ, బీ నుంచి ఏ ప్రమోషన్లకు టెస్టులు నిర్వహించారన్నారు. ఆ సమయంలో ఏ గ్రేడ్ పోస్టులు 17 ఖాళీలున్నాయని, ఈ 17 పోస్టులు ఖాళీలను పూర్తి చేస్తే బీ 17 ఉంటాయని తెలిపారు. కానీ ప్రమోషన్ ఇచ్చేటప్పుడు చాల తక్కువగా ఇచ్చారన్నారు. దానిని పున పరిశీలించి ప్రమోషన్ కల్పించాలని కోరారు. ఈపీ ఆపరేటర్లకు వేకెన్సీతో సంబంధం లేకుండా టైం బాండ్ ప్రమోషన్స్‌ను అమలు చేయాలన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎలుకపెల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిశుభ్రతను పాటించాలని మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ ఆల్బర్ట్, ఇరిగేషన్ డీఈ ధర్మయ్య, ఉన్నారు.

గ్రామసభల ద్వారాల అర్హుల ఎంపిక

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీలో జిల్లాలో అర్హులైన ప్రతి లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ప్రజల దగ్గర నుండి సంక్షేమ పథకాలపై అభిప్రాయ సేకరణ సర్వేకు సంబంధించి ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో డీఆర్డీఓ దత్తారంతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కింద సాగు భూములకు మాత్రమే భరోసా మొత్తాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. రాళ్లగుట్టలు, వెంచర్లు, ప్లాట్లు లాంటి భూములను గుర్తించడం జరిగిందన్నారు. భూమిలేని నిరుపేదలు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 20 రోజుల పైగా పని చేసిన కుటుంబాలను గుర్తించడం జరిగిందని వీరికి సంవత్సరానికి రూ.12,000 చెల్లించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రతి ఇంటికి అధికారులు సర్వే చేయడం జరిగిందని వివరించారు. దీని ప్రకారం అర్హులైన వారిని కానీ వారిని గుర్తించడం జరిగిందన్నారు. అర్హులైన వారి జాబితాను గ్రామసభలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి చదివి వినిపించడం జరుగుతుందని ఏదైనా అభ్యంతరాలు ఉంటే ప్రజలు తెలియజేయాలన్నారు. వాటిని సభలో నమోదు చేసి క్షేత్రస్థాయిలో మరోసారి అటువంటి వాటిపై సర్వే నిర్వహించడం జరుగుతుందని వివరించారు. లబ్దిదారుల జాబితాలో తమ పేరు లేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాబితాలో లేని వారు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేయకు ప్రత్యేక సెల్ లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. అంతకుముందు గ్రామస్తులు జిల్లా అధికారులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్ నాయకులు శివ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

సరైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం 26 నుండి అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు సరైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. మండలంలోని చిర్రకుంటలో నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పడం బాగానే ఉందని, దీనిని పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మురళి, అభిషేక్, కోట గొల్ల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బెజ్జూర్ : ప్రభుత్వ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ నదీమ్ కోరారు. మంగళవారం మండలంలో బెజ్జూరు, కృష్ణపెల్లి, అందుగులగూడ, కుంటలమానపెల్లి, రెబ్బెన అంబగట్టు, లంబడి గూడెం, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. బెజ్జూరు మండల కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి నదీమ్ పాల్గొని మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ గౌరీ శంకర్, వ్యవసాయ అధికారి నాగరాజు, టీపీసీసీ మెంబర్ హర్షత్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవర్ధన్, కాంగ్రెస్ నాయకులు నాహీర్ అలీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని బంబారా గ్రామ పంచాయతీలో అధికారులు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ హాజరై లబ్ధిదారుల ఎంపిక జాబితను చదివించారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికపై గ్రామస్తులకు వివరించారు. అనంతరం లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ ఉమర్, తహసీల్దార్ రియాజ్ అలీ, ఏఈఓ పరిమళ, ఏపీఎం శ్రావణ్, గిరిదవార్ అబ్దుల్ మాజిద్, సెక్రటరీ జాడి ధర్మా, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు అర్హత ఉండి దరఖాస్తు చేసుకోని వారు గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. మంగళవారం మండలంలోని నవ్వేగం, చింతకుంట, వెంకటరావుపేట్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏఓ గిరీష్, ఏఈఓలు, గ్రామ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

తిర్యాణి : అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరు కూడా నిరాశ చెందకూడదని ఎంపీడీఓ మల్లేష్ అన్నారు. మంగళవారం మండలంలోని గోవేన గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం అర్హులైన వారి పేర్లను తెలియజేశారు. ఈ నెల 26వ తేదీ నుండి ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు ఆత్మీయ భరోసా పథకాలు ప్రారంభమవుతాయని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరా ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక కోసం దరోగాపెల్లి, పోతపెల్లి, బొంబాయిగూడా, లోడ్‌పెల్లి, అగర్‌గూడ గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఆల్బర్ట్, ఎంఈఓ రమేష్ బాబు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ కబీర్ ఆధ్వర్యంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ గ్రామసభలకు హాజరై ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలని, ప్రతి ఒక్కరూ గ్రామసభల్లో పాల్గొని పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిరాంతరంగా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మనీషా, ఏఈఓ శ్రీవిద్య, శివ, రెవెన్యూ ఇన్స్ పెక్టర్ సురేష్, పంచాయతీ కార్యదర్శిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వాంకిడి



సిర్పూర్(టి)



పెంచికల్‌పేట్

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



నవతెలంగాణ- బెజ్జూర్

మండలంలోని బారెగూడ గ్రామంలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన అమ్మాయి(16)కి అదే గ్రామానికి చెందిన ఓ అబ్బాయితో బాల్య వివాహం చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు ఆపరేషన్ స్మైల్ 11లో భాగంగా కాగజ్‌నగర్ డివిజన్ టీం సహాయంతో బాల్య వివాహాన్ని అడ్డుకొని ఇరు కుటుంబాల పెద్దలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్మైల్ టీం ఇన్‌చార్జి ఎస్సై దుర్గం రాజయ్య మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. అనంతరం అమ్మాయిని బెజ్జూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ కరుణ, సత్య జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ ఝాన్సిరాణి, పోలీసు సిబ్బంది మౌనిక, విజయ్, శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆర్టిజన్లకు మద్దతు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ ఆర్టిజన్లు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజు 1104 యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఆర్టిజన్లకు విద్యార్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలన్నారు. ఏపీఎస్ఈబీ రూల్స్ ఇవ్వాలని కోరారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న వారికి వేరువేరు నిబంధనలు వర్తించడం సరైన విధానం కాదన్నారు. ఆర్టిజన్లు చేస్తున్న నిరసనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. తమ వంతుగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ జిల్లా చైర్మన్ మారుతి, కన్వీనర్ నసీరుద్దీన్, 1104 జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు సిహెచ్ రమేష్, డివిజన్ అధ్యక్షులు సురేందర్, డివిజన్ కార్యదర్శి రాజ్ కుమార్, కాగజ్‌నగర్ డివిజన్ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రానికి చెందిన ఏకారి మాధవి ఓ ప్రయివేట్ హాస్పిటల్లో చికిత్స తీసుకోగా సీఎంరిలీఫ్ ఫండ్ నుండి రూ.33,000 మంజూరయ్యాయి. మంగళవారం ఆ చెక్కును లబ్దిదారుల ఇంటి వద్దనే ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు మాధవి భర్త బానయ్యకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, బీజేపీ మండల అధ్యక్షులు డోకె రామన్న చేతుల మీదుగా వారికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు రామగోని తిరుపతిగౌడ్, కారు, ఈశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబయట పిల్లల సర్వే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే కొనసాగుతుందని ఎంఈఓ రాథోడ్ సుభాష్ తెలిపారు. మంగళవారం మండలంలోని సీఆర్పీలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ బడిఈడు పిల్లలు, మధ్యలో బడి మానేసిన విద్యార్థులను గుర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను పోషకులకు తెలియజేస్తూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. బడి బయట పిల్లలు లేకుండా చూడడమే తమ లక్ష్యమన్నారు.

24 నుంచి సదరం శిబిరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈనెల 24 నుంచి దివ్యాంగులకు సర్టిఫికెట్ల జారీ కోసం సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్డీఓ దత్తరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరాలకు ముందుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకొని బుక్ చేసుకోవాలని, ఈనెల 24న మూగ చెవిటి, 25న కంటి చూపు, 27న మానసిక వైకల్యం, 31న ఎముకలకు సంబంధించిన శిబిరం ఉంటుందన్నారు. దివ్యాంగులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సింగరేణిలో అవకాశాలను అందిపుచ్చుకోవాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయం ఆవరణలోని కాన్ఫరెన్సు హాల్‌లో మెడికల్ ఇన్వాలిడేట్ అయిన ఇద్దరు ఉద్యోగుల వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగంలో చేరే యువతీ, యువకులు నిబద్ధతతో పనిచేసి సంస్థ, కుటుంబ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. విధులకు గైర్హాజరు కాకుండా అధికారుల సూచనలు, ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించి ఉత్తమ ఉద్యోగులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. బొగ్గు నిల్వలకు కొదువ లేదని అందుకే సింగరేణి సంస్థకు మంచి మనుగడ ఉందన్నారు. పనికి వెనుకాడొద్దని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ఓటూ జీఎం కె.రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారులు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఫ్లాగ్ మార్చ్

- ఎస్‌డీపీఓ చిత్తరంజన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసుల ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఆసిఫాబాద్ ఎస్‌డీపీఓ చిత్తరంజన్ అన్నారు. జైనూర్‌లో పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌగోళిక పరిస్థితులు తెలుసుకోవడం కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ఎలాంటి శాంతిభద్రతల సమస్య, మతఘర్షణలు జరగకుండా ప్రజల భద్రతే తమ లక్ష్యమన్నారు. ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం ద్వారా ప్రజలకు సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ, మేమున్నామనే భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రజలు కూడా ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా తమ సమస్యలను శాంతిపుర్వకంగా, ప్రజాస్వామ్య మార్గంలో అధికారులకు నివేదించి పరిష్కరించుకోవాలని సూచించారు. దానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ తోడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జైనూర్ సీఐ రమేష్, డీసీఆర్‌బీ సీఐ సంపత్, జైనూర్, లింగాపూర్ ఎస్సైలు సాగర్, గంగన్న, పీఎస్సైలు పాషా, అనిల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-దహెగాం



నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఖర్జి గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎల్కరి సంజీవ్ హామీ మేరకు 5 సంవత్సరాలలో పుట్టిన 43 మంది బాలికలకు రూ.5 వేల చొప్పున రూ. 2.15 లక్షల ఫిక్స్ డిపాజిట్ చెక్కులను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, అందులో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ కింద మంజూరైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రాపర్తి ధనుంజయ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచ్లు దామోదర్ గౌడ్, తుమ్మిడి బక్కన్న, మల్లగౌడ్, బాపు, రాజన్న, వెంకన్న, మల్లేష్, సంజీవ్, రవితేజ గౌడ్, లక్ష్మణ్, చందు, ప్రదీప్ పాల్గొన్నారు.

మాలీల అభివృద్ధికి పాటుపడాలి



నవతెలంగాణ-కౌటాల

మాలీల అభివృద్ధికి పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం నూతనంగా ఎన్నికైన మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదే వసంత్ రావును కోనేరు కాలనీలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బౌద్ధ కుల పెద్దల ఆధ్వర్యంలో శాలువతో సన్మానించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలీలను ఐక్యం చేయడంతో పాటు హక్కుల సాధన కోసం ఉద్యమించాలన్నారు. సంఘం సభ్యులకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాధవ్, జనార్ధన్, మారుతి, వెంకటి, వినోద్, నగేశ్, భీంరావ్, చంద్రశేఖర్, సునీల్, దేవాజి, హిరమన్, రాజు, ఆకాష్, కార్తీక్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం క్రింద శిక్షణ, ఉపాధి, ప్లేస్‌మెంట్ కార్యక్రమం ద్వారా అర్హత గల క్రైస్తవ మైనార్టీ మహిళలకు అందించనున్న ఉచిత కుట్టుమిషన్లకు దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల మహిళలు ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటు ఆర్థికగా ఎదగాలన్నారు. ఎలాంటి సందేహాలుంటే కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదిస్తే నివృత్తి చేస్తామన్నారు.

26 నుండి గోల్డెన్ కప్ క్రికెట్ పోటీలు

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ఈ నెల 26 నుండి వాంకిడి గోల్డెన్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించడం జరుగుతుందని నిర్వాహకులు సాయి, ఎస్‌కే అబ్బు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.1100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.22222, ద్వితీయ బహుమతి రూ.11111 అందజేయడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆటలు ఆడే వారు క్రీడా స్పూర్తిని ప్రదర్శించాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9494361657, 6281620240ను సంప్రదించాలని కోరారు. క్రీడాకారులు టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు.

కట్టు మిషన్‌లు, సైకిళ్లు అందజేత

నవతెలంగాణ-లక్సెట్టిపేట



పట్టణంలోని రోటరీ క్లబ్ ఆఫ్ లక్సెటిపేట, గ్రీన్ క్రాంప్స్ ఆధ్వర్యంలో 20 కుట్టు మిషన్లు, 11 సైకిలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పల్లెర మనోహర్, సెక్రటరీ చింతల శ్రీనివాస్, ట్రెజర్ బోనగిరి కిషన్, చాటర్ అధ్యక్షుడు బాశెట్టి చంద్రగుప్త రోటరీ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-దండేపల్లి



పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి చిన్నయ్య అన్నారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం మండలాల భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులతో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సమయం తక్కువ ఉన్నందున ఇప్పటి నుండి పరీక్షలకు అనుగుణంగా ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారి శ్రీనివాస్, కాంప్లెక్స్ కార్యదర్శి అప్పల మనోహర్, రిసోర్స్ పర్సన్ పాత రమేష్, బొలిశెట్టి రాజన్న, సీఆర్పీ నర్సయ్య పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మండలం పెద్దంపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్పాండేలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని అర్హత గల నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపచేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రాధాన్యత క్రమంలో వర్తింపజేస్తామన్నారు. జాబితాలో పేర్లు రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో మీ-సేవ కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులు, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల గణన కార్యక్రమంలో సేకరించిన సమాచారం, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు జాబితాలో రానప్పటికీ మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాలలో, గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు, గుట్టలు, కాలనీలు, ఇండ్ల వెంచర్లు, లే-అవుట్లు, రైల్వే, నాలా భూములు, వివిధ అభివృద్ధి పథకాలకు ప్రభుత్వం సేకరించిన భూములు జాబితా నుండి తొలగించాలని తెలిపారు.

నస్పూర్ : నస్పూర్ మున్సిపల్ పరిధిలో గల శ్రీరాంపూర్ కాలనీ 5వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో కలెక్టర్ కుమర్ దీపక్ నస్పూర్ మున్సిపల్ కమీషనర్ సతీష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేద లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

గ్రామ సభల్లో రసాభాస



నస్పూర్‌లో..

జన్నారం : మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల్లో వచ్చిన అధికారులను ప్రజలు నిలదీశారు. మండలంలోని కామన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాయక గూడాలో 20 గిరిజన ఇండ్లు ఉండగా వారికి ఒకటి కూడా ఇందిరమ్మ ఇల్లు రాలేదని, ఒకరికి కూడా రేషన్ కార్డులో పేరు లేదని అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకంలో కూడా వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. కేవలం గ్రామాల్లో ఉన్న అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ లబ్ధిదారుల ఎంపిక సాగుతుందని ఇది సరైన పద్ధతి కాదని ఆ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని అధికారులు ప్రజలకు సూచించారు. పారదర్శకంగా ఈ గ్రామ సభలు కొనసాగుతున్నాయి అన్నారు. మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్, దేవునిగుడా, కొత్తపేట, కామన్‌పెల్లి, కవ్వాల్, కలమడుగు మురిమడుగు, హస్టల్ తండా మొర్రిగూడ వెంకటాపూర్, తొర్రే, మల్యాల సింగరాయపెట్ ఇంధన్‌పల్లి, మహ్మదాబాద్, రోటిగూడ, టీజీపల్లె తదితర గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలు ముగిశాయి. ఈ గ్రామ సభలో రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు, పంట పండే లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. ఆ జాబితాలో లేని వాళ్ల కూడా మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చని ఆయా గ్రామాలకు వెళ్లిన స్పెషల్ అధికారులు ప్రజలకు సూచించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ, పీఓపీఆర్డీ జలంధర్, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి సంగీత ఆర్ఐ గంగరాజు పాల్గొన్నారు.

తాండూర్ : అర్హులైన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ అన్నారు. మంగళవారం తాండూర్ మండలం మాదారంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు పథకాలను అమలుపరచిందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అంజయ్య తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, సీఐ కుమారస్వామి పశు వైద్యాధికారి పీవీ నరసింహారావు బెల్లంపల్లి ఏడీఏ రాజేందర్, వ్యవసాయాధికారి సుష్మ, కార్యదర్శి వసంత పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : లక్షటిపేట మున్సిపాలిటీ పరిదిలోని మార్కెట్ యార్డ్‌లో 14వ వార్డ్ సభను మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వార్డ్ కౌన్సిలర్ చింత సువర్ణ అశోక్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చింత సువర్ణ మాట్లాడుతు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వార్డ్ సభను విజవంతం చేయాలనీ, అలాగే రేషన్ కార్డ్ ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ ఎవరైతే అర్హులు ఉన్నారో వారి పేరు జాబితాలో రాకున్నా మరల దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ నెల 24 వరకు గడువు ఉంటుందని, ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డ్, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో వార్డ్ ఆఫీసర్ మానస,, ఆర్పీ వసంత, వార్డ్ అధ్యక్షుడు ఉత్తూరి రవీందర్ పాల్గొన్నారు.

జైపూర్ : ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల పంపిణీలో అర్హులైన వారికి తప్పక న్యాయం చేస్తామని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కల్పన అన్నారు. మంగళవారం భీమారం మండలం దాంపూర్, ధర్మారంలో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో స్థానిక ఎంపీడీఓ మధుసూధన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులకు సంబంధించిన లబ్ధిదారుల పేర్లు సభలో చదివి విన్పించారు.

లబ్ధిదారుల ఎంపికను విభేదించిన పోలంపల్లి గ్రామస్థులు

భీమారం మండలం పోలంపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఇందిర్మి ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే చేసిన వారిలో 79 మంది అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో పేరు లేకపోవడం గందరగోళంగా మారింది. స్థానిక తహసీల్దార్ సదానందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో గ్రామస్థులు లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు అన్యాయం జరిగిందని గ్రామానికి చెందిన నక్క తిరుపతి, సేదం నర్సయ్య దర్శనాల మధునయ్య, నక్క వేణు ఆవేధన వ్యక్తం చేశారు. రేషన్ కార్డుల పంపిణీ కోసం తయారు చేసిన లిస్టులో నక్క వేణు పేరు లేకపోవడం వివాదంగా మారింది. రేషన్ కార్డు కోసం ధరఖాస్తు చేసుకోవడంతో పాటు సర్వే సమయంలో వివరాలు అందించినా లిస్టులో పేరు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తరువాతి లిస్టులో పేరు ఉంటుందని స్థానిక తహసీల్దార్ సదానందం సర్ది చెప్పినా వినకుండా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియన గ్రామస్థులు తప్పుబట్టారు.

జైపూర్‌లో..

జైపూర్ మండలంలో గ్రామ పంచాయతీల వారిగా మంగళవారం గ్రామ సభలు ఏర్పాటు చేసిన అధికారులు ప్రభుత్వం పంపిణీ చేయ తలపెట్టిన లబ్ధిదారుల పేర్లు చదివి విన్పించారు. మిట్టపల్లి, ముదిగుంట గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి జడ్పీ సీఈఓ గణపతి పాల్గొన్నారు. జైపూర్, పెగడపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. లబ్ధిదారుల్లో అర్హులైన వారు లేకుంటే ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.



జైపూర్‌లో..



జన్నారంలో..



తాండూర్‌లో..



హాజీపూర్‌లో..

నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉండాలి

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



నవతెలంగాణ-జైపూర్

ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల సింగరేణి యాజమాన్యం స్పందించకపోతే కార్మికులు నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉండాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక్క రోజు టోకెన్ సమ్మెలో అత్యధికంగా పాల్గొన్న ఎస్టీపీపీ కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిధిలో గల 13 విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు 1040 మంది హెచ్ఎంఎస్‌తో కలిసి టోకెన్ సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. ఇంతటితో పోరాటం ఆగదని, ఇక్కడి కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరో మారు సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్‌తో పాటు సంబంధిత డైరెక్టర్‌ను కలిసి సమస్యలు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఎస్టీపీపీ నాయకులు విక్రమ్ కుమార్, సాయి కృష్ణా రెడ్డి, చిప్పకుర్తి సంపత్, సత్యనారాయణ చారీ, నవీన్, సంతోష్, శ్రీధర్, అక్బర్, ధీరజ్, రాజు, మని, జోసఫ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఎల్టా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించగా కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్ అరవింద్ రాణి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యింది. జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య మేమంటూ మరి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ ప్రకాష్ బానావత్, మణెమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రాజన్న, సీనియర్ ఉపాధ్యాయులు దాముక కమలాకర్, జాడి మురళి, రాజన్న గోవర్ధన్ పాల్గొన్నారు.



ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

నవతెలంగాణ-నస్పూర్

ఆశాలకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా నాయకులు చల్లూరి దేవదాస్ అన్నారు. మంగళవారం ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమ్మక్క, శోభ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరిలో నిర్వహించే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి, ప్రమోషన్, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశా వర్కర్లు రాష్ట్రంలో నిరవధిక సమ్మె చేశారని, సమ్మె సందర్భంగా గత సంవత్సరం 9 అక్టోబర్ హైదరాబాద్, కోఠి కమీషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశా వర్కర్లతో ధర్నా నిర్వహిస్తే అప్పటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారని, కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని, వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని గుర్తు చేశారు. డైరెక్టర్ హామీ ప్రకారం అక్టోబర్ 9న ఆశా వర్కర్లు నిరవధిక సమ్మెను విరమించారని, వీటితో పాటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీనిచ్చిందన్నారు.



కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు

- మున్సిపల్ చైర్మన్ వేణు

నవతెలంగాణ-నస్పూర్

ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావును విమర్శిస్తే ఇకముందు ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్మన్ వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి హెచ్చరించారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నస్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు బీఆర్ఎస్‌కు చెందిన కందుల ప్రశాంత్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేస్తే ఈ ఘటననుద్దేశించి స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావే ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేయించారని ఆరోపించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో ఏ చిన్న సంఘటన జరిగినా ఎమ్మెల్యే చేస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. 20 సంవత్సరాల కాలంలో మంచిర్యాల్‌లో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, ప్రేమ్ సాగర్ రావు వచ్చిన సంవత్సరంలోపే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తండ్రి, కొడుకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. నస్పూర్‌లో బీఆర్ఎస్ నాయకుడు వ్యక్తిగత గొడవల వల్లే అరెస్టు అయ్యాడని, దానికి కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఇటువంటివి కాంగ్రెస్‌పై రుద్దడం మంచి పద్ధతి కాదని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడుకునే క్రమంలో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ కౌన్సిలర్లు మడిగ మల్లయ్య, కోడూరి విజయలహరి, డీసీసీ సెక్రెటరీ భూపతి శీను, గెల్లు మల్లేష్, మాజీ జిల్లా యువత అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.



విధుల పట్ల ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

- భవిష్యత్తులో మరిన్ని అవార్డులు రావాలి
- ఎస్టీపీపీని సందర్శించిన డైరెక్టర్ సత్యనారాయణరావు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల ఇదే స్పూర్తిని కొనసాగించాలని సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ రావు సూచించారు. మంగళవారం ఎస్టీపీపీని సంధర్శించిన ఆయన వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమిక్షా సమావేశం నిర్వహించారు. అవార్డుల పరంపర కొనసాగిస్తున్న ఎస్టీపీపీ ఇటీవల నాలుగు అవార్డులు రావడంతో అధికారులను అభినందించారు. ఎస్టీపీపీ మిథనాల్ ప్లాంట్, ఎఫ్‌జీడీ, 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 10 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్, సివిల్స్ పనులను పరిశీలించిన ఆయన పనుల పూర్తికి తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్లాంట్‌కు సంబంధించిన 1200 మెగావాట్ల యునిట్లు సమర్థవంతంగా నిర్వహించి ఆశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. అదేవిధంగా రాబోవు రోజుల్లో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణ పనుల విషయమై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు ఇతర విభాగాలకు చెందిన అధికారులు శ్రీనివాసులు, జేఎన్ సింగ్, కేఎస్ఎన్ ప్రసాద్, మదన్‌మోహన్, అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్

నవతెలంగాణ-జైపూర్

యువకులు చదువుతోపాటు క్రీడల్లో రానించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు వెర్రబెల్లి రఘునాథ్ అన్నారు. మండల పరిధి మిట్టపల్లి గ్రామంలో చెన్నూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్‌తో కలిసి మంగళవారం ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సంధర్బంగా మాట్లాడుతూ భవిష్యత్ లక్ష్యంతో విషయ పరిజ్ఞానం కలిగివున్న చదువుకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వార చదువు పూర్తి చేసిన వెంటనే జీవితంలో స్థిపడతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూట రాజకుమార్, బీజేవైఎం మండల అధ్యక్షులు పల్లికొండ వెంకటేష్, ఉపాధ్యక్షుడు రామిటెంకి సాయి, నాయకులు మునీందర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా నాయకులు రామగిరి రాము మాదిగ, జైపూర్ మండల ప్రధాన కార్యదర్శి రామగిరి మధు మాదిగ, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, రమేష్, మనోహర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన మండల విద్యార్థిని



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ విద్యార్థిని ఈసం సంజన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఇటీవ జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 బాల బాలికల క్రికెట్ పోటీల్లో విద్యార్థిని సంజన ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్ తెలిపారు. ఈ నెల 22 నుండి 24 వరకు ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఆమె పాల్గొంటున్నట్లు తెలిపారు. గత నెలలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న సంజన అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కాగా ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల నుండి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సంజనను ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్ఐ శ్రీధర్, ఎంపీఓ శ్రీపతి బాపురావు, ఎంఈఓ శ్రీనివాస్‌లు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పరిధిలో గల సమస్యల పరిష్కారం కోసం శాఖ పరంగా కృషి చేస్తామని జైపూర్ ఎస్ఐ శ్రీధర్ సూచించారు. రామగుండం కమీషనర్ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి రామారావుపేట్ గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం ఒకరికి ఒకరు సహకరించుకోవాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలన కోసం గ్రామస్థులు, యువకులు సహకరించాలని కోరారు. గంజాయి సేవించినా, విక్రయించినా చట్ట పరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా సమాజంలో గుర్తింపు పొందే విధంగా నడుచుకోవాలని, వాహణాలు నడుపుతున్నప్పుడు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీధర్‌ను స్థానిక నాయకులు శాలువాలతో సన్మానించారు.



ఆర్‌ఎంపీ డాక్టర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కెరమెరి



ఆర్‌ఎంపీ డాక్టర్ల మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా తెలండి మోతీరాం, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కార్యదర్శిగా జమీర్ ఖాన్, సభ్యులుగా చోలే సుధాకర్, ప్రభాకర్, విల్టన్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీ డాక్టర్ల సంఘం సభ్యులు నూతన మండల అధ్యక్షున్ని శాలువతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పాలక్‌రావ్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీ డాక్టర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు భాద్యతగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు పద్మాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులతో భోజనం చేసిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని లింగోజీతండ గ్రామపంచాయతీ పరిధిలోని లాల్‌టెకిడ్డి తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో భోజనం చేసి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. చలికాలంలో విద్యార్థులు హాస్టల్లో జాగ్రతలను పాటించి, మంచి చదువును చదివి కళాశాలకు పేరును రాష్ట్ర స్థాయిలో మర్మోగేలా మార్కులు తీసుకొని రావాలని కోరారు. ఈ తనిఖీల్లో సబ్ కలెక్టర్ యువరాజ్, తహసీల్దార్ ప్రవీణ్, డీపీఆర్వో తిరుమల, ఆర్సీఓ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్ ఉన్నారు.

ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలని సింగరేణి క్యాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రిలో వారానికి ఒకసారి స్పెషలిస్ట్ డాక్టర్ క్యాంపు నిర్వహించాలని, ఉద్యోగులకు కేటాయించిన అన్ని క్వార్టర్లకు సింటెక్స్ ట్యాంకులు, అవసరమైన పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన సిబ్బంది కారణంగా అదనపు సులబ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈపీ ఆపరేటర్లకు వేకెన్సీతో సంబంధం లేకుండా డీ నుంచి బీ, బీ నుంచి సీ గ్రేడ్ ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు బయ్యు మొగిలి, కమిటీ సభ్యులు శేషశైనారావు, జూపాక రాజేష్, సముద్రాల ఆనంద్, బి.జగ్గయ్య, మారం శ్రీనివాస్, మారిన వెంకటేశం, ఏ సంపత్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పోతపల్లి, గుంట్లపేట్ గ్రామస్తులు ప్రత్యేకాధికారి ఎంపీడీఓకు గుంట్లపేట గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతపెల్లి, గుంట్లపేట గ్రామాలు దూరంగా ఉండడం గ్రామపంచాయతీ పనుల నిమిత్తం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామపంచాయతీ ఏర్పాటుకు తగిన జనాభా కలిగి ఉందని, తమ గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, గ్రామస్తులు తుమ్మెర శేఖర్, వాగయ్య గోపాల్, మహేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బుద్ధుని మార్గంతోనే ప్రపంచ శాంతి



నవతెలంగాణ-వాంకిడి

బుద్ధుని మార్గంతోనే ఆధునిక ప్రపంచంలో ప్రతి ఇంట శాంతి నెలకొంటుందని, ప్రతి మనిషి బుద్ధుడి ప్రవచనాలను పాటించాలని భారతీయ భిక్షు సంఘ్ ప్రధాన కార్యదర్శి దమ్మసారధి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జైత్వాన్ బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బుద్ధుని ప్రేరణతోనే డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ వరల్డ్ నాలెడ్జ్ ఆఫ్ సింబల్ అయ్యారని, ఈ విషయాన్ని కొలంబో యూనివర్సిటీ ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం నాగ్‌పూర్ పట్టణానికి చెందిన భాంతే రాహుల్ మాట్లాడుతూ సమాజంలో మూడు నమ్మకాలు మనల్ని విజ్ఞానం వైపుకు వెళ్లకుండా అడ్డుకొంటున్నాయని అన్నారు. మండలకేంద్రంలోనీ జేత్వాన్ బుద్ధ విహార్‌లో మార్చి ఒకటి నుండి 10 వరకు నిర్వహించే జిల్లాస్థాయి శ్రామినర్ బుద్ధ దీక్ష శిబిరాన్ని జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మండలంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌కు వచ్చిన ఆయనకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహల్కర్, పూలే అంబేద్కర్ బుద్ధ భూమి ట్రస్ట్ అధ్యక్షులు విజయ్ ఉగ్రే, కార్యదర్శి విలాస్ కోబ్రాగడే, సమతా సైనిక్ దళ్ ఇన్‌చార్జి దుర్గం సందీప్, సిద్ధార్థ యువజన సంఘం అధ్యక్షులు మహేష్, అంబేద్కర్ సంఘం నాయకులు ఉగ్రే రోషన్, రాజేశ్వర్, రమేష్, చంద్రమణి, విట్టల్, నూతన్, జాడే రమేష్, దుర్గం చింటూ, మహేందర్, దుర్గం ప్రశాంత్, సెల్వాట్కర్ భీంరావు పాల్గొన్నారు.

పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ-వాంకిడి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ఆహార సామాగ్రి నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన మందులు, పోషక విలువలు కలిగిన ఆహారం అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భం దాల్చిన వారు సమీప ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏబీవీపీ క్రీడోత్సవ్ పోస్టర్ విడుదల

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడోత్సవ్ పోస్టర్‌లను స్థానిక ఎస్ఎస్ఆర్ కళాశాలలో ఏబీవీపీ నాయకులు విడుదల చేశారు. ఏబీవీపీ కన్వీనర్ చంద్రగిరి శివ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. ఇందులో భాగంగా ఏబీవీపీ విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహిస్తుందని అన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలాని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలలో మొత్తం 9,127 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం సైతం ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మధ్యంతర సన్నద్ధ పరీక్షలు నిర్వహిస్తూ, బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని అన్నారు. ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిరంతరం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని, పరీక్షలకు సన్నద్ధం చేయాలనీ సూచించారు. ప్రతి పాఠశాలలో ఈ నెల చివరి నాటికీ 10వ తరగతి సిలబస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను మానసికంగా ధృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలని సూచించారు. పాఠాలను సులభంగా గుర్తుంచుకునే విధంగా మెలుకువలు నేర్పించాలన్నారు. సబ్జెక్టుల వారిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతానికి సంబంధించిన వివరాల నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. అనంతరం పాఠశాలల వారిగా పదో తరగతి విద్యార్థుల సంఖ్య, ఇప్పటివరకు పూర్తి చేసిన సిలబస్, ప్రత్యేక తరగతుల నిర్వహణ, పరీక్షలకు సన్నద్ధమవుతున్న వివరాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, అంబాజీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు పద్మ, సలోమి కరుణ, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేకాధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డిని మంగళవారం దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని సోఫీనగర్‌లోని నిర్మల్ బుద్ధ విహార్‌లో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గతంలో నిర్మల్ డీఎస్పీగా పనిచేశారని అన్నారు. పదోన్నతి పొంది తిరిగి మళ్లీ నిర్మల్‌కు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిర్మల్ ఏఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల విషయంలో నిరంతరం కృషి చేస్తానని అన్నారు. గతంలో డీఎస్పీగా ఉన్నప్పుడు కూడా అనేకమైన సేవలను అందించానని అన్నారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ ఇటీవలే నిర్మల్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రెడ్డి గతంలో ఎన్నో సమస్యలు పరిష్కరించాడని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ బుద్ధ విహార కమిటీ, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కుంటొల్ల వెంకటస్వామి, మునేశ్వర్ మధుకర్, డి.రాములు, డాక్టర్ రాచర్ల ప్రవీణ్, గడపాలే ప్రభాకర్, బత్తుల రంజిత్, గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ అందజేత



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలో పురుషులకు దీటుగా ఆటోలు నడుపుతూ కుటుంబ భారం నడుపుతున్న మహిళలకు ఆర్టీఏ అధికారులు మంగళవారం డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేశారు. జిల్లా కేంద్రంలోని కాశవ్వ, మంజుల గత కొన్ని నెలలుగా ఆటో నడుపుతూ మహిళకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆర్టీఓ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా వారికి డ్రైవింగ్ లైసెన్స్‌ను అందజేసినట్టు పేర్కొన్నారు. ఇందులో ఆర్టీఏ అధికారులు మహేందర్, ముర్తుజా అలీ, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేత



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన అయిటి అనిల్ తన సొంత ఖర్చులతో ఉచితంగా టై, బెల్ట్, గుర్తింపు కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని చదువు నేర్పిన గురువులకు, తల్లి తండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై జి.అశోక్, తాజా మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, ప్రధానోపాధ్యాయులు రేగుంట రాజేశ్వర్, ఉపాధ్యాయులు అర్చన, చంద్రశేఖర్, మురళీ మనోహర్‌రెడ్డి, గంగాధర్, శంకర్ సింగ్, శ్రీధర్, రవి, విజయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాల పరిరక్షణకు అందరూ సహకరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ ఏఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కాజల్‌ను మంగళవారం మండలంలోని హస్నాపూర్ గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చట్టాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎలాంటి ఆటంకాలు ఉన్న నేరుగా ఫోన్ చేసి సంప్రదించాలని ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అజయ్, శంకర్, గణేష్, రమేష్ పాల్గొన్నారు.

నేడు ఇచ్చోడలో గ్రామసభ

నవతెలంగాణ-ఇచ్చోడ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలు అమలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామసభ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు సంబంధించిన అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన రాజు



నవతెలంగాణ-బోథ్

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని మంగళవారం హైదరాబాద్‌లో బోథ్ మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఎలుక రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి బోథ్ మండలంలోని ప్రతి గ్రామంలో మాల సంక్షేమ సంఘ భవనాలు నిర్మించాలని, బోథ్‌లో పలు కార్యాలయాలు లేవని ముఖ్యంగా రెవెన్యూ డివిజన్, ఫైర్ స్టేషన్ ప్రభుత్వ కళాశాల సమస్యలపై వివరించామని అన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సీఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో షెడ్డు నిర్మాణం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తేజపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో హిందీ పండితుడిగా వెండి కిషోర్ గత సంవత్సర కాలం నుంచి పనిచేస్తున్నాడు. పాఠశాల అంటే ఒక దేవాలయమని ఉన్నత భావంతో మంగళవారం పాఠశాల వేదికపై తన సొంత ఖర్చులతో షెడ్డు నిర్మించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మణిలత మాట్లాడుతూ ఇప్పటివరకు ఎందరో ఉపాధ్యాయులు వస్తున్నారు వెళ్తున్నారు కానీ ఇప్పటివరకు ఇటువంటి ఉన్నత భావంతో సొంత ఖర్చులతో పాఠశాలలో ఇంత ఉపయోగకరంగా ఎవ్వరు కూడా ఇటువంటి పనులను చేపట్టలేదని అన్నారు. ఈరోజు హిందీ పండిత్ వెండి కిషోర్ చేసిన పని మరువలేనిదని అన్నారు. అంతేకాకుండా మహనీయుల చిత్రపటాలను సైతం సొంత ఖర్చులతోనే ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల బృందం హిందీ పండిత్ వెండి కిషోర్‌ని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యూషన్ ఫీజు చెల్లింపు అవకాశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెండవ మూడవ సంవత్సరం అలాగే పీజీ రెండవ సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లింపు గడువును పొడగించినట్లు ఆదిలాబాద్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జగ్రామ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25 వరకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. కావున ట్యూషన్ ఫీజు చెల్లించనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఆదిలాబాద్
బుధవారం | జనవరి 22, 2025 | www.navatelangana.com

యూఎస్‌ఎఫ్‌ఐ క్యాలెండర్‌ విడుదల

నవతెలంగాణ-నస్పూర్



యూఎస్‌ఎఫ్‌ఐ క్యాలెండర్‌ను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌ సాగర్‌రావు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయుల చరిత్రతో క్యాలెండర్‌ను యూఎస్‌ఎఫ్‌ఐ ముద్రించడం అభినందనీయమని విద్యార్థి సంఘాలు మహనీయుల చరిత్రను విద్యార్థులకు తెలియపరచాలని అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలతో ముందుకెళ్లాలని సూచిస్తూ సంఘ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్



మండలం బెజ్జాల గ్రామంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.6 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం మాజీ సర్పంచ్‌ జయపాల్‌ గౌడ్‌ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ప్రజల అభ్యర్థన మేరకు చెన్నూర్‌ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ వెంకటస్వామి నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రజలు ఎమ్మెల్యే వివేక్‌ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- జిల్లా కలెక్టర్‌ అభిలాష అభినవ్‌

నవతెలంగాణ-నిర్మల్‌



సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్‌ అభిలాష అభినవ్‌ స్పష్టం చేశారు. మంగళవారం నిర్మల్‌ పట్టణంలోని నాయిడివాడ, నిర్మల్‌ గ్రామీణ మండలం న్యూ పోచంపాడ్‌ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన వార్డు, గ్రామ సభలలో కలెక్టర్‌ పాల్గొని ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈనెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్‌ గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో రూ.12 వేల అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకంలో పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్‌ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామసభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. రేషన్‌ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈనెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమాలలో ఆర్డీఓ రత్నా కళ్యాణి, డీఎస్‌ఓ కిరణ్‌ కుమార్‌, తహసీల్దార్లు రాజు, సంతోష్‌, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్‌ : గ్రామసభల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్‌ రాజర్షి షా అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఉమ్రీ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్‌ రాజర్షి షా పాల్గొని మాట్లాడుతూ గ్రామసభలో సంబంధిత అధికారులు ప్రజలకు ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

తలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామసభలను నిర్వహిస్తోందని ఎంపీడీఓ రాజమోహన్‌ అన్నారు. అందులో భాగంగానే మంగళవారం మండలంలోని అర్లి(కె), భరంపూర్‌, కజ్జర్ల, రత్నాపూర్‌, ఖోడద్‌, కోసాయి, కుచులాపూర్‌, పూనగూడ గ్రామపంచాయతీలలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. రైతుబరోసా, ఆత్మీయ బరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌ కార్డులు 4 గ్యారంటీ పథకాలపై గ్రామ సభలలో లబ్ధిదారులు ఎంపిక చేశామని అన్నారు. ఈ గ్రామసభల్లో శేఖర్‌, వినోద్‌, వ్యవసాయ శాఖ అధికారి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ రోహిదాస్‌, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండలంలోని కుంటాల(బి) గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ రాజ్‌ వీర్‌ ఆధ్వర్యంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎంపీడీఓ రాజ్‌వీర్‌ మాట్లాడుతూ నాలుగు గ్యారంటీలపై గ్రామస్తులకు వివరించగా, రైతు భరోసాపై వ్యవసాయ అధికారులు రైతు భరోసాకు సంబంధించిన రైతు భరోసాపై వచ్చిన పేర్లను చదివి వినిపించగా, ఎవరికైనా అభ్యంతరం ఉన్న తెలుపాలని అన్నారు. అంతేకాకుండా రేషన్‌ కార్డులపై అంతే కాకుండా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన పేర్లు వచ్చిన పత్రాలని చదివి వినిపించారు. గ్రామస్తులు రేషన్‌ కార్డులు ఉన్నా, రేషన్‌ కార్డులో పిల్లల పేర్లు లేవని తెలిపారు. దానికి బదులుగా గ్రామస్తులకు రాజ్‌వీర్‌ వివరిస్తూ ఎవరి పేర్లు అయితే లేవో వారు 24లోపు అప్లికేషన్‌ పెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో..



తలమడుగులో..

గట్రావ్‌పల్లికి బస్సు నడపాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గిరిజన గ్రామమైన గట్రావ్‌పల్లికి ఆర్టీసీ బస్సు నడపాలని మంచిర్యాల డిపో మేనేజర్‌ను తెలంగాణ ఆల్‌ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అట్కపురం రమేశ్‌ కోరారు. ఈ మేరకు డిపో కార్యాలయంలో మేనేజర్‌ జనార్ధన్‌కు వినతిపత్రం అందించారు. గత కొన్ని నెలలుగా గట్రావ్‌పల్లికి బస్సు రావడం లేదని, దీంతో ఆదివాసీ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే బస్సు రాకపోకలను ప్రారంభించాలని కోరారు.

సరస్వతి కాల్వలో పడి రైతు మృతి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్‌

సోన్‌ మండలంలోని న్యూవెల్మల్‌లో ప్రమాదవశాత్తు సరస్వతి కాలువలో పడి రైతు మృతి చెందినట్లు ఎస్సై గోపి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పోతుగంటి చిన్న గంగారాం(53) సోమవారం రాత్రి చేను పని ముగించుకుని టీవీఎస్‌ ఎక్సెల్‌పై ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు వాహనానికి అడవి పంది అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సరస్వతి కాలువలో పడిపోయాడు. అతన్ని గాలించగా కాలువలో మృతదేహం మంగళవారం లభించిందని తెలిపారు.

సోన్‌ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్‌

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం సోన్‌ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. న్యూవెల్మల్‌, బొప్పారం, సోన్‌, మాదాపూర్‌, పాక్‌పట్ల, గాంధీనగర్‌ తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతినిత్యం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మైనార్టీల గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల 5వ, ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సర తరగతుల ప్రవేశం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్‌ యూనిస్‌ సలీం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ తరగతిలో 40 సీట్లకు గాను మైనార్టీల విద్యార్థులకు 30 సీట్లు, నాన్‌ మైనారిటీ విద్యార్థులకు 10 సీట్ల చొప్పున సీట్లు కేటాయించబడ్డాయని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో మొత్తం 80 సీట్లకు గాను, 60 సీట్లు మైనారిటీలకు, 20 సీట్లు నాన్‌ మైనార్టీలకు కేటాయించడం జరిగిందన్నారు. తమ పాఠశాల, కళాశాలలో పూర్తి ఉచిత విద్యను అందించడంతో పాటు మెరుగైన వసతి గృహం, అత్యాధునిక లేబరేటరీ, లైబ్రరీ, విశాలమైన గదులు, మంచి మెనూతో కూడిన నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే తమ పాఠశాల నుంచి ప్రతి సంవత్సరం 10వ, ఇంటర్మీడియట్‌ పరీక్షా ఫలితాలలో 100శాతం ఉత్తీర్ణతను సాధించడంతో పాటు విద్యార్థులు ప్రస్తుత ప్రముఖ విశ్వవిద్యాలయాలలో చోటు దక్కించుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల, కళాశాలలో కార్పొరేట్‌ పాఠశాల కళాశాలలకు దీటుగా బోధించే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అధ్యాపక బృందం ఉందని వివరించారు.

సంస్కారం పెంపొందించడానికే విద్యాభారతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్‌

విద్యతో పాటు బస్తీల్లో ఉన్న పేద విద్యార్థులకు సంస్కారాలను, దేశభక్తిని పెంపొందించడానికి విద్యాభారతి సంస్కార కేంద్రాలను నిర్వహిస్తోందని విద్యా భారతి అఖిల భారతీయ సేవా ప్రముఖ్‌ రాం స్వరూప్‌ శర్మ అన్నారు. దేశ వ్యాప్తంగా 12,500 సంస్కార కేంద్రాలను విద్యా భారతి నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్థానిక ఆదిలాబాద్‌ కేంద్రంలో 10 బస్తీల్లో సంస్కార కేంద్రాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఇందులో వెలికి తీస్తామన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం, ప్రజ్ఞా పాటవాలు, బుద్ధి, మనస్సు వికాసం కూడా అదే స్థాయిలో వికాసం చెందాలని, ఈ ప్రయత్నం సంస్కార కేంద్రాల మాధ్యమంగా జరుగుతోందని తెలిపారు. ఓ వైపు సరస్వతీ శిశు మందిరాలు విద్యను అందిస్తున్నాయని, వాటితో పాటు ఇతర గుణాల వికాసం కోసమే సంస్కార కేంద్రాలుపని చేస్తున్నాయన్నారు. ఆదిలాబాద్‌ కేంద్రంలో మరిన్ని సంస్కార కేంద్రాలు నడవడానికి పుర ప్రముఖులు, విద్యావంతులు కూడా తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్రం సేవా ప్రముఖ్‌ కుందూర్‌ విద్వాన్‌రెడ్డి, తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్‌ జీఎస్‌ఎస్‌ శాస్త్రి, సహ సేవా ప్రముఖ్‌ గౌరుగారి గంగాధర్‌రెడ్డి, విభాగ్‌ కార్యదర్శి కట్టా నాగాచారి, శైక్షణిక్‌ ప్రముఖ్‌, వేణుమాధవ్‌ పాల్గొన్నారు.

క్రికెట్‌ బ్యాట్లు అందజేత



నవతెలంగాణ-జైపూర్‌

భీమారం మండల కేంద్రానికి చెందిన క్రికెట్‌ క్రీడాకారులకు స్థానిక మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్‌ నాయక్‌ మంగళవారం క్రికెట్‌ బ్యాట్లు అందజేశారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో స్థానిక యువకులకు క్రికెట్‌ బ్యాట్లు అందజేసిన ఆయన క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రాజ్‌కుమార్‌కు యువకులు కృజ్ఞతలు తెలిపారు.

ఉచిత కుట్టుమిషన్లకు దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ-నస్పూర్‌

తెలంగాణ క్రైస్తవ, మైనార్టీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం క్రింద అర్హత గల క్రైస్తవ, మైనార్టీ మహిళలకు అందించనున్న ఉచిత కుట్టుమిషన్లకు దరఖాస్తు గడువును జనవరి 25వ తేదీ వరకు పొడిగించినట్టు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల మహిళలు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటలలోగా ఆన్‌లైన్‌లో టీజీఓబీఎంఎంఎస్‌.సీజీజీ.జీఓవీ.ఇన్‌ వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కడ్తాల్‌లో గ్రామసభ రసాభాస



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్‌

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల అమలుకు సోన్‌ మండలం కడ్తాల్‌ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అనర్హులను ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేశారని అధికారులను నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించకుండానే లబ్ధిదారుల ఎంపిక ఎలా చేశారంటూ మండిపడ్డారు. అధికారులు చేసేది ఏమీ లేక సభ సరిగా నిర్వహించకుండానే వెళ్లారు.

ఆర్టీఐ మండల కమిటీ నియామకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్‌



సమాచార హక్కు రక్షణ చట్టం-2005 సొసైటీ ఆసిఫాబాద్‌ మండల కమిటీని నియమిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు కమలాకర్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలో నియోజకవర్గ అధ్యక్షులు జాడి రవిదాస్‌ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజల వజ్రాయుధమని, సహ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారితనం సహచట్టంతోనే సాధ్యమన్నారు. సహ చట్టం కార్యకర్త ప్రతి ఒక్క అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం సమన్వయంతో సహ చట్టాన్ని బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్క సభ్యుడు ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేరొన్నారు. మండల అధ్యక్షులుగా దుర్గం సుధాకర్‌, ఉపాధ్యక్షులుగా మల్కాడి శ్రీనాథ్‌, ప్రధాన కార్యదర్శిగా కాట్కార్‌ భీంరావ్‌, సహాయ కార్యదర్శి జనార్ధన్‌, కోశాధికారి షేక్‌ జాఫర్‌ షరీఫ్‌ను నియమించారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌

కాగజ్‌నగర్‌ పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల టౌన్‌ ఎస్‌ఐ సుధాకర్‌ మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక ఎన్టీఆర్‌ చౌక్‌లో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో హెల్మెట్‌ ధరించకపోవడం, సీటు బెల్ట్‌ పెట్టుకోకపోవడం, మద్యం తాగి వాహనాలను నడుపడం వల్ల జరిగే నష్టాల గురించి ఎస్‌ఐ వాహనదారులకు వివరించారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్‌ లైసెన్స్‌ కలిగి ఉండాలని, క్రమం తప్పకుండా వాహనాలకు ఇన్సూరెన్స్‌ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించాలి

- మున్సిపల్‌ చైర్మెన్‌ గండ్రత్‌ ఈశ్వర్‌

నవతెలంగాణ-నిర్మల్‌



చేనేత హస్త కళాకారులు ఎంతో నైపుణ్యంతో తయారు చేసిన, వస్త్రాలను, ప్రజలందరూ కొనుగోలు చేసి, వారిని ప్రోత్సహించాలని మున్సిపల్‌ చైర్మెన్‌ గండ్రత్‌ ఈశ్వర్‌ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాగులవాడ ఎంఎస్‌ ఫంక్షన్‌ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అఖిల భారత హస్తకళా, చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకం మేళాను మంగళవారం రిబ్బన్‌ కట్‌ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత హస్తకళలకు మార్కెట్‌లో డిమాండ్‌ ఉందని అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది, సంబంధిత కళాకారులు పాల్గొన్నారు